కరెంట్ కష్టాలకు చెక్..

- పచ్చర్లల్లో పూర్తైన 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులు
- మూడు గ్రామాలకు తీరనున్న విద్యుత్ సమస్యలు
- ప్రస్తుతం నడుస్తున్న ట్రయల్ రన్


పచ్చర్లలో సిద్ధమైన 33/11కేవీ సబ్ స్టేషన్

రాజోళి: పచ్చర్ల సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయి ప్రస్తుతం ట్రయిల్ రన్ నడుస్తుండటంతో మండలంలోని పచ్చర్ల, తుమ్మిళ్ల, వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా పడుతున్న విద్యుత్ సమస్యలు తీరనుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు గ్రామాలే లక్ష్యంగా....

మండలంలోని పచ్చర్ల, తుమ్మిళ్ల, వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామాల్లో గతంలో కరెంట్ కష్టాలు వేధించేవి. రైతులు తమ పొలాల్లో నీరు పెట్టుకునేందుకు కరెంట్ ఎప్పుడు ఉంటుందో తెలియక ఎన్నో అవస్థలకు గురయ్యేవారు. ఆ కష్టాలను అధిగమించేందుకు పచ్చర్ల గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దాని కోసం ఒక ఎకరా భూమి కేటాయించారు. 2017 అక్టోబర్ 24న అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావ్ భూమి పూజ చేసి సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించారు. దాదాపు ఎనిమిదేళ్లుగా మూడు ఫీడర్ల ద్వారా మూడు గ్రామాలకు కరెంట్ కష్టాలు తీర్చేందుకు చేపట్టిన పనులు నత్తనడకన సాగాయి. దీంతో పనులు జరుగుతాయా లేక మధ్యలోనే నిలిచిపోతాయా అని సందేహాలు ప్రజల్లో మొదలయ్యాయి. ఈ క్రమంలో గతేడాది నుంచి పనులు జోరందుకున్నాయి. ప్రధాన పనులన్నీ ముగిసి, ప్రస్తుతం ట్రయిల్ రన్ నడుస్తుండటంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

24 గంటలు సరఫరా..

సబ్ స్టేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఫీడర్ల ద్వారా తుమ్మిళ్ల, పచ్చర్ల, తనగల గ్రామాలకు విద్యుత్ 24 గంటల పాటు సరఫరా కానుంది. దీంతో వ్యవసాయ అవసరాలకు రైతులు ఇబ్బందులు లేకుండా కరెంటును వాడుకునే వెసలుబాటు కలిగిందని, ఇళ్లలో కూడా గతంలో అప్ అండ్ డౌన్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడే వారని ప్రస్తుతం ఆ కష్టాలు తీరుతాయని అధికారులు పేర్కొన్నారు.



సిద్ధమైన ఆపరేటింగ్ సిబ్బంది గది

సంతోషంగా ఉంది..



గత కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ ద్వారా ఆ కష్టాలు తీరనున్నాయి. వ్యవసాయ పనుల దగ్గర ఎన్నో బాధలు పడుతూ పంటలకు నీరు అందించే వాళ్లం. పచ్చర్ల సబ్‌స్టేషనతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు కూడా ఎంతో మేలు జరుగుతుంది.

– శంకర్, రైతు తుమ్మిళ్ల

అందరికీ ప్రయోజనకరం..



పచ్చర్లలో నిర్మించిన సబ్ స్టేషన్‌తో ఇటు రైతులకు, గృహ వినియోగదారులకు అటు అధికారులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. గతంలో సరైన సరఫరా లేక జంపర్లు ఎగిరిపోవడంతో ఇబ్బందులు పడటంతో పాటు, అధికారుల చుట్టూ తిరిగే వాళ్లం. అధికారులకు కూడా పని భారం పెరిగేది.

–విశ్వనాథ్ రెడ్డి రైతు పచ్చర్ల

ట్రయల్ రన్ నడుస్తుంది..



ప్రస్తుతం పచ్చర్ల సబ్ స్టేషన్ ద్వారా ట్రయల్ రన్ నడుస్తుంది. మూడు ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేసే ఈసబ్ స్టేషన్‌తో నిరంతరంగా విద్యుత్ సరఫరా మూడు గ్రామాలకు అందుతుంది. దీంతో గతంలో రైతులు పడిన కరెంట్ కష్టాలు తీరనున్నాయి. త్వరలో పూర్తి స్థాయిలో సేవలు అందుతాయి.

–సందీప్, విద్యుత్ ఏఈ రాజోళి

క్లుప్తంగా

పాఠశాలను సందర్శించిన ప్రత్యేకాధికారి



ధరూరు: పదో తరగతి వార్షిక పరీక్షల పర్యవేక్షణ ప్రత్యేకాధికారి షకీలాబాను శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా టీశాట్ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం



మల్దకల్: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవీ ఆలయంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు ఆర్‌ఎంపీ శంకర్ తెలిపారు. వైద్యురాలు లావణ్య వైద్య పరీక్షలు చేసి అనంతరం మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. మల్దకల్ ప్రజలే కాక పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, బాదం శ్రీనివాసులు, మనసాని నాగరాజు, చంద్రశేఖర్ రావు, అరవిందరావు, పద్మారెడ్డి, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.1,00,001 విరాళం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం బుర్దిపాడుకు చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి నూతన కల్యాణ మండప నిర్మాణానికి రూ.1,00,001 విరాళం అందజేశారు. అదే విధంగా కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు శంకర్ ఆలయ అభివృద్ధికి రూ.10,050 ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి విరాళం

అయిజ: మండల కేంద్రంలోని చర్చి అభివృద్ధి పనులకు బీఆర్‌ఎస్ నాయకులు సంకాపురం రాముడు ఆర్థిక సాయం చేశారు. శనివారం పీడీ సుందర్రావు, క్రీస్తు సంఘం సభ్యులు మండలంలోని సంకాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు రాముడిని మర్యాద పూర్వకంగా కలిశారు.చర్చి అభివృద్ధికి ఆర్థిక సహాయం చేయాలని కోరగా రాముడు రూ.30 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు



ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సూచన మేరకు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి శనివారం తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ అభిప్రాయాన్ని నిర్భయంగా తెలియజేయవచ్చని సూచించారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



ధరూరు: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. వాహన తనిఖీల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో తనిఖీలు చేపట్టారు. తనిఖీలో రెండు డ్రంకెయిన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు


గద్వాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్: ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 24వ వార్డు కాంగ్రెస్ నాయకులు గువ్వల గోపాల్, ఎస్‌వీఆర్ రాజు, అన్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖర్‌అలీ వీధి ప్రీమియర్ లీగ్ సీజన్‌–1 క్రికెట్ పోటీలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా చేసుకుని ఆడాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, సుదర్శన్ రెడ్డి, బాబర్, మురళీ, వెంకట్రాములు, రిజ్వాన్, ఫయాజ్, మోబిన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా సరఫరా

కేటీదొడ్డి: రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు. శనివారం మండలంలోని మల్లాపురంతాండలోని సిద్దన్‌పల్లి గ్రామ శివారులో రూ.83 లక్షల వ్యయంతో 33 కేవీ కొత్తలైన్ నిర్మాణ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గద్వాల ప్రాంత రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. కరెంటు లేక సరైన పంటలు లేక అప్పుల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశామన్నారు. భవిష్యత్‌లో గద్వాల నియోజకవర్గంలోని ఏ గ్రామంలో కూడా లో ఓల్టేజ్ సమస్య లేకుండా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీ రమేష్‌బాబు, ఏఈ అనిల్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, రామకృష్ణనాయుడు, నాయకులు చక్రధర్, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సహాయక సంఘాలను బలోపేతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న మహిళలు

ధరూరు: గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి వాటిని బలోపేతం చేయాలని ఐకేపీ ఏపీఎం శోభారాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని అల్వలపాడు గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై పొదుపు, బ్యాంక్ రుణాలు తదితర అంశాలపై చర్చించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. అందరి సహకారంతోనే సంఘాల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ నవీన్‌కుమార్, సీఆర్‌పీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

శనగ పంటపై గడ్డిమందు పిచికారీ


ఎండిపోయిన శనగపంట

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–2 గ్రామ శివారులో 10 ఎకరాల్లో గ్రామానికి చెందిన బోయ చిన్న బుచ్చన పప్పుశనగ పంట సాగు చేస్తున్నాడు. పంటపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారీ చేయడంతో పంట నాశనమైందని బాధిత రైతు వాపోతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రూ.1.50 లక్షలు నష్టం వచ్చినట్లు రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరుతున్నాడు.

బీఎస్‌ఎన్‌ఎల్ సమస్యలు పరిష్కరించండి



అలంపూర్: జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్ సమస్యలు పరిష్కరించాలని బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ రాజేశ్వరిని కోరినట్లు టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఇస్మాయిల్ అన్నారు. సంగారెడ్డిలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో అడ్వైజరీ కమిటీ తొలి సమావేశం శనివారం జరిగినట్లు తెలిపారు. టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన ఇస్మాయిల్‌ను జనరల్ మేనేజర్ రాజేశ్వరి, జేటీఓ సంతోష్ శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్‌కు జిల్లాలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.ప్రధానంగా సిగ్నల్స్, టవర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష



గట్టు/ ఇటిక్యాల/అలంపూర్ : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కస్తూర్బా ఎస్‌ఓ గోపిలత తెలిపారు. 6వ తరగతి ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

■ ఇటిక్యాల మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం టీజీసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి లోపు ప్రవేశానికి ప్రవేశ పరీక్ష జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

■ అలంపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఉదయం 9 గంటల వరకు చేరుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలో శనివారం మాజీ వార్డు సభ్యుడు మద్దిలేటి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వీఎం అబ్రహం వారి భౌతికదేహానికి నివాళ్లులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాశపోగు రాజు, మాజీ ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, తనగల మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



మానవపాడు: మండలంలోని కొర్విపాడు శివాలయంలో శనివారం శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాకృతిలో పూలతో అందంగా అలంకరించారు. ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో శివస్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిరంతర తనిఖీలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా ఉన్న చెక్‌పోస్ట్‌లో పశుసంవర్ధక శాఖ నిరంతర తనిఖీలు నిర్వహిస్తుంది. అధికారులు వీఏఎస్ శంకరయ్య, జేవీఓ శ్రీశైలం, వీఏ ప్రభాకర్‌లతో పాటు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చే కోళ్లు, కోడిగుడ్లు, దాణాకు సంబంధించిన వాహనాలు తనిఖీ వెనక్కి పంపుతున్నారు. కార్యక్రమంలో చెక్‌పోస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలి


రాజోళి గాంధీచౌక్‌లో సంతకాలు సేకరిస్తున్న ఎంవీ ఫౌండేషన్ సభ్యులు

రాజోళి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం సీఆర్‌పీఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. విద్యకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల కోసం ప్రత్యేక డ్రైవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో విక్రమ్ సింహారెడ్డి, ప్రభుదాస్, సుధాకర్, అబ్దుల్ రహిమాన్ తదిదరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ..

కేటీదొడ్డి: విద్యా రంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ సభ్యులందరి చేత సేకరించిన సంతకాల పత్రాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు విద్యా పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షుడు వీరన్న తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బాలల హక్కులకు మద్దతు ఇవ్వాలని, విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సాయికుమార్, మండల ఇన్‌చార్జి కిరణ్, సీఆర్పీ కోఆర్డినేటర్లు, గ్రామ కన్వీనర్లు గోవిందు, శ్రీపాద రెడ్డి, రవి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్‌లు


అమరవాయిలో ఉపాధ్యాయులతో ఎంఈఓ సురేష్

మల్దకల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు జీహెచ్‌ఎం నరేష్ తెలిపారు. శనివారం అమరవాయి ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంప్లెక్స్ స్థాయి గద్వాల, మల్దకల్ మండలాల్లోని 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విజేతలకు ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, జీహెచ్‌ఎం నరేష్ నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీంద్రబాబు, మహేష్, నర్సింహ్మస్వామి, విష్ణు, జానకమ్మ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ప్రదీప్‌కుమార్, అక్షితుడు, భాస్కర్, పాపన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు..

అయిజ: మండలంలోని ఉప్పల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉత్తనూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి హరినాథ్, అమ్రేష్ కుమార్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారికి ఉప్పల పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు బలరాం రూ.3 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్ రెడ్డి, మేడికొండ సముదాయ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లు దోహదం..

ధరూరు: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి మట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడం కోసం టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర చెల్లించాలి


కొనుగోలు కేంద్రం వద్ద బీడీ పొగాకు

అలంపూర్ రూరల్: బుక్కాపురానికి వెళ్లే మార్గంలోని బొమ్మిడాల కంపెనీ యాజమాన్యం గిట్టుబాటు ధర కల్పించకుండా అన్యాయం చేస్తుందని బీడీ పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కాశీపూరం, లింగన్‌వాయి, కోనేర్ రైతులు బీడీ పొగాకు విక్రయించేందుకు శనివారం రాగా యాజమాన్యం నమ్మించి మోసం చేస్తుందని ఆరోపిస్తున్నారు. రూ.15,000 ఇవ్వాల్సిన వాటికి రూ.13,000 నుంచి 13,500 ధర ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మిడాల కంపెనీ దగ్గరే విత్తనాలు, మందులు కొని పంట వేసినట్లు తెలిపారు. తీరా గిట్టుబార ధర కల్పించకుండా ఇష్టానుసారంగా ధరలు తగ్గించేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బంది అశోక్, బయ్యర్ భద్రం మాట్లాడుతూ.. పొగాకు ప్యాకేజీ చేస్తున్నప్పుడే గ్రేడింగ్ చేసుకోని రావాలని, బాగలేని సరుకును సీఆర్ చేస్తున్నామని తెలిపారు. పొగాకు బాగలేనందుకు కొంత ధర తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

అలంపూర్: ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని హరిజనవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సమ సమాజ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇంటర్‌నేషనల్ సంస్థ శనివారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్ కుమార్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థికి ఉన్నత లక్ష్యం ఉండాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలు సాధించడానికి కష్టపడి చదవాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు 155 మంది విద్యార్థులు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సేవా ట్రస్ట్ సభ్యులు ఏమేలమ్మ, నాగరాజు, రాజు, నరసింహ, మాబుసాబ్, ఉపాధ్యాయులు శేఖర్, భరత్, వెంకట్ నాయుడు, సురేష్, శ్రీధర్ ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


పోటీలో బండలాగుతున్న ఎద్దులు

అయిజ: మండల కేంద్రంలో తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న రైతు సంబరాల్లో శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులు అంతర్రాష్ట్ర స్థాయి పాలపళ్ల విభాగం వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలో 16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన బీఎల్‌కే బుల్స్ ప్రథమ బహుమతి రూ. 30వేలు, ద్వితీయ బహుమతి 20 వేలు కైవసం చేసుకున్నాయి. అదే విధంగా ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన ఆంజనేయరెడ్డి ఎద్దులు తృతీయ బహుమతి రూ.15 వేలు, నంద్యాల జిల్లా సంజాముల మండలం ముక్కమల్లకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి ఎద్దులు నాల్గవ బహుమతి రూ. 8 వేలు గెలుచుకున్నాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1976–80 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ. 23 వేల విలువైన ప్రింటర్ కమ్ జిరాక్స్ మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు హేమలత వారిని అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లోకారెడ్డి, సూరయ్య, రఫీక్, హనుమంతు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గంటల నుండి రాత్రి 8-00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల - కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ - ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జబ్బర్ లాల్ : 9553955603